సాక్షి సిద్దిపేట

గురువారం । 25 । మే । 2023



ఆశ చూపి..ఎర వేసి

సైబర్ నేరగాళ్లు రోజుకో తీరుగా మోసాలకు పాల్పడుతూనే ఉన్నారు. కార్డులు అప్‌డేట్ చేసు కోవాలని.. రెట్టింపు లాభాలు వస్తాయని ఆశచూపి ఎరవేస్తూనే ఉన్నారు. 8లో



తూతూ మంత్రంగా సమావేశం

ఎంపీపీ లత అధ్యక్షతన బుధవారం నిర్వహించిన తొగుట మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా కొనసాగింది. 9లో

నేటి నుంచి సిటీ పోలీస్ యాక్ట్

సిద్దిపేటకమాన్: సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో నేటి నుంచి జూన్ 1వ తేదీ వరకు సిటీ పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని సీపీ శ్వేత తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, సమావేశాలు, సభలు నిర్వహించరాదని, సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

స్విమ్మింగ్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న సీపీ శ్వేత

సిద్దిపేటఎడ్యుకేషన్: సీఎం కప్ జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీలను బుధవారం పోలీస్ కమిషనర్ శ్వేత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ నాగేందర్, స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జున్, ప్రధానకార్యదర్శి గుండి ప్రవీణ్, క్రీడా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ ఫలాలు

మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రవీణ్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్: పేదలకు సంక్షేమ ఫలాలు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. హాథ్‌సే హాథ్ జోడో యాత్రలో భాగంగా బుధవారం మండలంలోని పొట్లపల్లెలో ఇంటింటా తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.500ల గ్యాస్ బండ, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల సాయం, ఆరోగ్య శ్రీ కింద రూ.5లక్షల ఉచిత వైద్యం, ఇంట్లో ఇద్దరు వృద్ధులకు రూ.5వేల పింఛన్, మొదటి ఏడాదిలో 2లక్షల ఉద్యోగాల భర్తీ, పంటలకు గిట్టుబాటు ధర, ధరణి పోర్టల్ రద్దు, కౌలు రైతులకు ఏటా రూ.15వేల పెట్టుబడి సాయం, ఉపాధి కూలీలకు ఏటా రూ.12వేల సాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, వైస్ ఎంపీపీ నిర్మల, మండల అధ్యక్షుడు చందు, తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు పనిదినాలు పెంచాలి



కూలీలతో మాట్లాడుతున్న వెంకటేశ్

అక్కన్నపేట(హుస్నాబాద్): ఉపాధి హామీ కూలీలకు పనిదినాలు,కూలీలు పెంచాలని గిరిజన సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి భానోతు వెంకటేశ్ అన్నారు. బుధవారం అక్కన్నపేట మండలం గండిపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు పనిదినాలు, వసతుల కల్పనపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధీనం కొనసాగుతున్న ఉపాధి హామీ పథకం కింద కూలీలకు సకాలంలో డబ్బులు చెల్లించాలన్నారు.అదేవిధంగా ఎర్రటి ఎండలో పనిచేస్తున్న కూలీలకు వసతులు తప్పకుండా కల్పించాలన్నారు. మంచినీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేయాలన్నారు. గడ్డపార, తట్ట, టెంటు తదితర సౌకర్యాలను కేంద్రం ప్రభుత్వం ఇవ్వడంలేదని, గత కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో ప్రతి కూలీలకు ఇచ్చేవారన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, చంద్ర, ధర్మ, బిల్యా, జుమ్లా తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను గద్దెదించాలి



మహనీయుల చిత్ర పటాలకు పూలమాల వేస్తున్న రామచంద్రం

బెజ్జంకి(సిద్దిపేట): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చని బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిశాని రామచంద్రం పిలుపునిచ్చారు. బుధవారం బెజ్జంకిలో నిర్వహించిన బీఎస్పీ మానకొండూర్ నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులకు, ప్రభుత్వ పథకాలు, పదవుల కేటాయింపులో ఎస్సీ, బీసీలకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. హామీలను నెరవేర్చనివారికి ఓటుతో సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు బొనగిరి ప్రభాకర్, జిల్లా ఇన్‌చార్జ్ మంద బాలయ్య, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు నల్లాల శ్రీనివాస్, బాలకిషన్, వెంకన్న, సంపత్, ప్రమీల, మల్లయ్య, రాజమల్లు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సాగుతో మేలు

- వైపరీత్యాల నుంచి తప్పించుకోవచ్చు
- తోర్నాల వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తల సూచన
- విత్తన మేళాలో ప్రదర్శన, విక్రయాలు



విత్తన బ్రోచర్‌ను విడుదల చేస్తున్న అదనపు కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

సాక్షి, సిద్దిపేట: పంట కాలాన్ని ముందుకు జరపడం ద్వారా ప్రకృతి వైపరీత్యాల నుంచి తప్పించుకోవచ్చని, తద్వారా నష్ట నివారణతో పాటు, అధిక దిగుబడి పొందవచ్చని తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు సూచించారు. బుధవారం తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానంలో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ నిపుణులు మాట్లాడుతూ.. జూన్ రెండో వారం నుంచి అక్టోబర్ మొదటి వారం వరకు ఖరీఫ్, అక్టోబర్ చివరి వారం నుంచి ఫిబ్రవరి చివరి వారం వరకు యాసంగి పంట కాలం ఉంటుందని, పంట చేతికి వచ్చే ఈ సమయంలో వడగండ్ల వానలు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయన్నారు. నష్టాల నుంచి తప్పించుకునేందుకు పంటల కాలాన్ని త్వరగా ప్రారంభించాలని వివరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనం అందజేస్తున్న వ్యవసాయ పరిశోధన స్థానం నిపుణులను అభినందించారు. సుస్థిర సాగు, అధిక లాభాల కోసం రైతులు నిపుణుల సలహాలు పాటించాలని సూచించారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ మాట్లాడుతూ వేసవిలో లోతు దుక్కులు దున్నడం వలన మొగి పురుగును నివారించవచ్చని అన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు వంగ నాగిరెడ్డి, తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ శ్రీదేవి, శాస్త్రవేత్తలు డాక్టర్ సీహెచ్ పల్లవి, ఉమారాణి, సరిత, శ్వేత, సాయినాథ్, రైతులు పాల్గొన్నారు.

తోర్నాలలో అందుబాటులో ఉన్న విత్తనాలు..

కేఎస్ఎం–118(దొడ్డు రకం)



కేఎస్ఎం–118 దొడ్డురకం వానాకాలం, యాసంగిలో అనుకూలంగా ఉంటుంది. వడగండ్ల వానలో గింజలు రాలే లక్షణం తక్కువగా ఉంటుంది. 120 నుంచి 125 రోజుల్లో పంట చేతికి వస్తుంది. ఎకరాకు 28 నుంచి 32 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. 25 కేజీల బ్యాగు రూ.1,000లకు విక్రయిస్తున్నారు.

జేజీఎల్–24423 (దొడ్డురకం)



జేజీఎల్–24423 దొడ్డురకం వానాకాలం, యాసంగికి అనుకూలం. 125 రోజుల్లో పంట చేతికి వస్తుంది. ఆరుతడి, నేరుగా వెదజల్లే పద్ధతులకు అనుకూలం. సుడిదోమ, చలి, చౌడును తట్టుకుంటుంది. ఎకరాకు 30 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. 25కేజీల బాగు రూ.1,000లకు విక్రయిస్తున్నారు.

డబ్ల్యూ జీ ఎల్–44(సిద్ధి) సన్నరకం



డబ్ల్యూజీఎల్–44(సిద్ధి) సన్నరకం వానాకాలానికి అనుకూలం. 145 రోజుల్లో పంట చేతికి వస్తుంది. ఉల్లికోడు (బయోటైపు–1)ని తట్టుకుంటుంది. ఎకరాకు 24 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. 25 కిలోల బ్యాగు రూ.1,100లకు లభిస్తుంది.

కేఎస్ఎం–1638(కూనారం వరి–2) సన్న రకం



కేఎస్ఎం–1638(కూనారం వరి–2) సన్న రకం వానాకాలం, యాసంగికి అనుకూలం. 120 నుంచి 135 రోజుల్లో పంట చేతికి వస్తుంది. గింజ నాణ్యత బాగుంటుంది. ఉల్లికోడు(బయోటైపు -1,2,4)ని తట్టుకుంటుంది. ఎకరాకు 28 నుంచి 32 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. 25 కిలోల బ్యాగును రూ.1,100లకు విక్రయిస్తున్నారు.

డబ్ల్యూ ఆర్ జీ ఈ–97(వరంగల్ కంది–1)



డబ్ల్యూ ఆర్ జీ ఈ–97 (వరంగల్ కంది–1) ఇది వానాకాలానికి అనుకూలం. 150 నుంచి 160 రోజుల్లో పంట చేతికి వస్తుంది. పత్తిలో అంతర పంటగా సాగు చేయవచ్చు. గింజలు ఎరుపు రంగులో ఉండి మధ్యస్థ లావుగా ఉంటాయి. ప్యూజేరియం ఎండు తెగులును తట్టుకుంటుంది. ఎకరానికి 6 నుంచి 7 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. 3 కిలోల బ్యాగుకు రూ.390లకు లభిస్తుంది.

అందుబాటులో విత్తనాలు



రెండు దొడ్డు, మూడు సన్నరకాల వరి విత్తనాలను విక్రస్తున్నాం. కేఎస్ఎం -118 విత్తనం 263 క్వింటాళ్లు, జేజీఎల్–24423 దొడ్డురకం 182 క్వింటాళ్లు, డబ్ల్యూ జీఎల్–44 సన్నరకం 72 క్వింటాళ్లు, కేఎస్ఎం–1638 సన్న రకం 31 క్వింటాళ్లు, డబ్ల్యూ ఆర్ జీఈ–97(వరంగల్ కంది–1) 19 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయి. పూర్తి వివరాలకు 9849822270, 7337399466, 9542666355 నంబర్లలో సంప్రదించవచ్చు.

– డాక్టర్ శ్రీదేవి, ప్రధాన శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన స్థానం



మహిళలకు రుతుప్రేమ కప్స్ పంపిణీ చేస్తున్న మంత్రి హరీశ్‌రావు, ప్రక్కన ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

మానవ మనుగడకు మూలం రుతుచక్రం

ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

దుబ్బాకటౌన్: ఆరోగ్యవంతమైన సమాజం రుతుప్రేమ ద్వారా లభిస్తుందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. దుబ్బాక మండలం పోతారం గ్రామంలో బుధవారం ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, డాక్టర్ శాంతి, డీపీఓ దేవకి ఆధ్వర్యంలో నిర్వహించిన రుతుప్రేమ అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు రుతుప్రేమ కప్స్ పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మానవ మనుగడకు మూలం రుతుచక్రమని, దీనిపై నిశబ్ధం వీడాలన్నారు. పోతారం తరహాలో అన్ని గ్రామాల్లో రుతుప్రేమ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ప్రతీ మంగళవారం ఆరోగ్య మహిళ కార్యక్రమంలో అన్నిరకాల వైద్య పరీక్షలు జరిపి మందులు అందిస్తారని తెలిపారు.

జూన్‌లో కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు

రక్తహీనతతో బాధపడే గర్భిణులకు జూన్ నుంచి కేసీఆర్ కిట్ల పంపిణీ ప్రారంభిస్తామని ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 6.8 లక్షల మందికి 3వ, 7వ నెలలో రెండుసార్లు ఈ కిట్లను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొత్త పుష్పలత, మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత, సర్పంచ్ గడీల జనార్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

హెల్త్ ఈజ్ వెల్త్



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటఎడ్యుకేషన్: చదువుతో పాటు విద్యార్థులకు శారీరక దృఢత్వాన్ని అందించేందుకు తల్లిదండ్రులు కృషిచేయాలని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో బుధవారం నిర్వహించిన సీఎం కప్ పోటీల ముగింపు సమావేశంలో పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఫిజికల్ ఫిట్‌నెస్ కూడా ముఖ్యమన్నారు. భవిష్యత్‌లో సిద్దిపేటలో ఇండోర్ షటిల్ కోర్టును ఏర్పాటు చేసుకుందామని, సీపీ కార్యాలయంలో 400ల మీటర్ల రన్నింగ్ ట్రాక్ సిద్ధమైందన్నారు. కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చే క్రీడాకారులకు అన్నిరకాల సహాయ సహకారాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, డీవైఎస్ఓ నాగేందర్, స్పోర్ట్స్ క్లబ్ కన్వీనర్, నర్సింగ్ కౌన్సిల్ సభ్యుడు పాల సాయిరామ్, క్రీడా సంఘాల బాధ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డంప్‌యార్డ్ రహిత పట్టణమే లక్ష్యం

ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: డంప్ యార్డ్ రహిత పట్టణంగా సిద్దిపేటను మార్చడమే లక్ష్యమని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. బుధవారం మున్సిపల్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, కమిషనర్ సంపత్, వైస్ చైర్మన్ కనకరాజు, పర్యావరణ ప్రతినిధి డాక్టర్ శాంతితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తడి, పొడి, చెత్త, వార్డుల్లో కంపోస్టు తయారీ కేంద్రాలు, డీఆర్సీసీ కేంద్రం పనితీరుపై చర్చించారు. పట్టణంలో రోజుకు 30 టన్నుల తడి చెత్త బుస్సాపూర్ వద్ద బయో గ్యాస్ గా మారుతుందని, అదేవిధంగా 12 టన్నుల పొడి చెత్త డిఆర్సీసీ కేంద్రంలో రీసైక్లింగ్ అవుతున్నట్టు పేర్కొన్నారు. చెత్త వేసే వారికి జరిమానా విధించాలని, బ్లాక్ స్పాట్స్, నైట్ శానిటేషన్, బుస్సాపూర్ డంప్ యార్డ్ ప్రత్యేక మానిటరింగ్ కోసం సానిటరీ ఇన్‌స్పెక్టర్లు బాధ్యత వహించాలన్నారు. సమావేశంలో మాజీ చైర్మన్ రాజనర్స్, అదనపు కమిషనర్ మల్లికార్జున్, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు సతీష్, గోపయ్య, మాధవి, హరితహారం అధికారి ఐల్లయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహంకాళమ్మకు పూజలు

కొండపాక(గజ్వేల్): మండలంలోని మర్పడ్గలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మహంకాళమ్మ వార్షికోత్సవంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పాల్గొని పూజలు చేశారు. మహంకాళమ్మ తల్లి మహిమాన్వితమైందని, అమ్మవారి కృపతో ప్రజలు సంతోషంగా ఉండాలని కోరినట్లు తెలిపారు. రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు దొంతి నర్సింహ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి తిరుపతిరెడ్డి, సభ్యులు జగన్మోహన్‌రెడ్డి, మల్లారెడ్డి, చిటుకుల నర్సింహ్మారెడ్డి పాల్గొన్నారు.

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు

అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేటరూరల్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపడుతున్నట్లు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం పౌరసరఫరాల శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ రవీందర్ సింగ్, మేనేజింగ్ డైరెక్టర్ వి.అనిల్ కుమార్ కలిసి ధాన్యం కొనుగోళ్లు, కస్టమ్ మిల్లింగ్ రైస్ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో అన్ని వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సజావుగా జరుగుతున్నాయని, వానాకాలం సందర్భంగా మిల్లులో ధాన్యం భద్రపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. సమావేశంలో డీసీఎస్ఓ బ్రహ్మారావు, డీఎం హరీశ్, పాల్గొన్నారు.

పనుల్లో అలసత్వం ఉండొద్దు

కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: మన ఊరు మనబడి పనుల్లో అలసత్వం పాటించొద్దని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. బుధవారం దుబ్బాక నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న మన బడి పథకం పనుల పురోగతిపై అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. నిబంధనల ప్రకారం పాఠశాలల్లో పనులు చేపట్టాలని, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఎన్ఆర్ఈజీఎస్, ఈజీఎస్ కింద చేసే పనుల్లో మరుగుదొడ్లు, కిచెన్ షెడ్, ప్రహరీ, అదనపు గదులు త్వరగా పూర్తి చేయ్యాలన్నారు. ఎంపీడీఓ, ఎంపీఓలు రోజువారిగా సందర్శించాలన్నారు. పాఠశాల పేరును స్టిల్స్ కలర్‌లో ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ చంద్రమోహన్ రెడ్డి, డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బీ ఈఈ రాములు, హెచ్ ఎంలు, ఎస్ఎంఎసీ చైర్మన్లు, ఎంఈఓ, ఎంపీడీఓ, ఏపీఓ, ఇంజినీరింగ్ విభాగం ఏఈ, డీఈలు, సర్పంచ్, కౌన్సిలర్లు, నిర్మాణ ఏజెన్సీలు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌కు కొత్త శోభ

చేర్యాల నకాశి చిత్రాలతో కలెక్టరేట్ భవనం కొత్త శోభ సంతరించుకుంది. జిల్లా నుంచి పలు సమస్యల పరిష్కారానికి వచ్చే ప్రజలు, కార్యాలయానికి వచ్చే అధికారులకు అందమైన రంగుల చిత్రాలు స్వాగతం పలుకుతున్నాయి. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా కనువిందు చేసే చిత్రాలను కలెక్టరేట్ భవనం ప్రవేశ ద్వారం వద్ద రంగులద్దుతుండగా సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

సమయానికి సిద్ధమయ్యేనా?

- 2.25కోట్లతో డిగ్రీ కళాశాల భవనం
- మౌలిక సదుపాయాలు లేక నిరుపయోగం
- త్వరగా పూర్తిచేయాలంటున్న స్థానికులు



వినియోగంలోకి రాని కొత్త భవనం



ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాత భవనం

హుస్నాబాద్: మంత్రి కేటీఆర్ ఇటీవల అట్టహాసంగా ప్రారంభించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనం సౌకర్యాలు లేక వెలవెలాపోతోంది. ఇంత కాలం శిథిలావస్థ పాత భవనంలో కొనసాగిన తమకు దాని నుంచి విముక్తి దొరికిందని విద్యార్థులు, అధ్యాపకులు సంబరపడేలోగా.. కనీస వసతులు లేని కొత్త భవనం వారిని వెక్కిరిస్తోంది. ఇదీ హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల దుస్థితి. రూ.2.25కోట్లతో చేపట్టిన కళాశాల నూతన భవనంలో మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో అది నిరుపయోగంగా మారింది. ఓ వైపు దోస్ ఆన్‌లైన్ ద్వారా విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోంది. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి భవనంలో అన్ని సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆగుతూ.. సాగుతూ

- మండల కేంద్రంలో ఏళ్లుగా డిగ్రీ కళాశాల భవనం రేకుల షెడ్‌లో కొనసాగుతోంది. సరిపడా తరగతులు లేక, సౌకర్యాల లేమితో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు.
- పదేళ్ల క్రితం గత ప్రభుత్వం మోడల్ స్కూల్ సమీపంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనం నిర్మించేందుకు ప్రతిపాదించింది.
- రూ. 2.25కోట్లతో ప్రారంభమైన పనులు నిధులు లేమితో నత్తనడకన సాగుతూ వచ్చాయి.
- దాదాపు ఆరేళ్లుగా కొనసాగిన పనులు ఇటీవల పూర్తయ్యాయి. భవనానికి రంగులు వేసి, లోపల ఫ్యాన్లు బిగించారే తప్ప ఇతర సౌకర్యాలు ఏవీ కల్పించలేదు.
- కాగా ఈ నెల 5న మండల పర్యటనకు వచ్చిన మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా నూతన భవనాన్ని హడావిడిగా ప్రారంభించారు.
- భవనంలో విద్యుత్ కనెక్షన్, మంచినీటి సదుపాయం, సైన్స్ ల్యాబ్, ఫర్నిచర్ ఇతర సౌకర్యాలు కల్పించలేదు.
- ఈ కళాశాలలో బీఎస్సీ, బీజెడ్‌సీ, బీకాం, బీఏ కోర్సుల్లో గతేడాది 215 మంది విద్యార్థులు విద్యనభ్యసించారు.
- ప్రస్తుతం దోస్త్ ద్వారా డిగ్రీ కళాశాల ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది.
- తొలి విడతలో జూన్ మొదటి వారంలో సీట్ల కేటాయింపు జరగనుంది. జూన్ రెండో వారానికి సీట్ల కేటాయింపు పూర్తి చేసి, తరగతులు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.
- ఈ క్రమంలో విద్యాసంవత్సరం ప్రారంభానికైనా నూతన భవనంలో సదుపాయాలు కల్పిస్తారా ..లేదా.. అనేది ప్రశ్నార్థకంగా మారింది.
- డిగ్రీ కళాశాల పక్కనే రూ.1కోటి వ్యయంతో నిర్మించిన ఎస్టీ ఉమెన్స్ హాస్టల్‌లో కూడా కనీస సౌకర్యాలు లేవు.
- సదుపాయాలు కల్పించి, వాచ్‌మెన్‌ను నియమించి వినియోగంలోకి తేస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది.
- సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి భవనంలో పూర్తిస్థాయి సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు వివరించాం



కొత్త భవనం నిర్మించారు కాని, అందులో పూర్తి స్థాయి వసతులు లేవు. కరెంట్, నీరు, ఫర్నిచర్, సైన్స్ ల్యాబ్ తదితర సౌకర్యాలు త్వరగా కల్పించాలని ఉన్నతాధికారులను కోరాం. ఈ విషయంపై ఇటీవల ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ను కలిసి విన్నవించాం. తరగతుల ప్రారంభం నాటికి వసతులు కల్పించాలి.

– రాజిరెడ్డి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హుస్నాబాద్

త్వరలో అందుబాటులోకి..

ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనంలో కరెంట్ వైరింగ్ పూర్తయింది. వారం రోజుల్లో కనెక్షన్ ఇచ్చి, రెలింగ్ పూర్తి చేసి వినియోగంలోకి తెస్తాం. కళాశాల భవనాన్ని స్వాధీనం చేసుకోగానే కాంట్రాక్టర్‌కు ఫైనల్ బిల్లు చెల్లిస్తాం.

– మహేశ్వర చారి, డీఈ, సోషల్ వెల్ఫేర్

క్లుప్తంగా

డీసీఎం డ్రైవర్ రిమాండ్

పటాన్‌చెరు టౌన్: నలుగురు మృతికి కారణమైన డీసీఎం డ్రైవర్‌ను రిమాండ్ కు తరలించారు. పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్ రెడ్డి కథనం ప్రకారం మండల పరిధిలోని చిట్కుల్‌కు చెందిన డీసీఎం డ్రైవర్ రాజేందర్ ఈనెల 11 వతేదీన అదే గ్రామానికి చెందిన నాగరాణి పెళ్లి జరగా, మరునాడు వికారాబాద్ జిల్లా మొయినాబాద్ మండలం చిన్నమంగళారం గ్రామానికి చెందిన పెళ్లికొడుకు నాగభూషణం ఇంటి వద్ద రిసెప్షన్ వెళ్లాడు. తిరిగి వస్తున్న సమయంలో రుద్రారం శివారులో ముందు వెళుతున్న లారీని ఢీకొట్టాడు. సంఘటన స్థలం వద్ద ఇద్దరు, చికిత్స పొందుతూ మరో ఇద్దరు మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు డ్రైవర్ రాజేందర్ మద్యం తాగి డ్రైవింగ్ చేసినట్టు తెలియగా, అతన్ని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

గడ్డివాము దగ్ధం

అక్కన్నపేట(హుస్నాబాద్): నిప్పంటుకొని గడ్డివాము దగ్ధమైంది. మండలపరిధిలోని చౌటపల్లి గ్రామానికి చెందిన చల్లగొండ సంపత్ రావు వ్యవసాయ పొలంలో రెండు విద్యుత్ తీగలు తాకి ప్రమాదవశాత్తు గడ్డివాముకు నిప్పంటుంకొని బూడిద అయ్యింది. సమాచారం తెలుసుకున్న ఫైర్ ఇంజిన్ సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పింది. ఈ ఘటనలో ఎలాంటి పెద్ద ప్రమాదం జరగక పోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భిక్షాటన చేస్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని రాక్‌గార్డెన్ వద్ద కొంతకాలంగా 45ఏళ్ల వ్యక్తి భిక్షాటన చేస్తున్నాడు. అనారోగ్యంతో బాధ పడుతూ బుధవారం రాక్‌గార్డెన్ వద్ద మృతి చెందాడు. టౌన్‌షిప్ హోంగార్డుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రైతు..


శ్రీనివాస్ (ఫైల్)

కంది(సంగారెడ్డి): విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఇంద్రకరణ్ ఎస్‌ఐ రాజేష్‌నాయక్ కథనం ప్రకారం కంది మండల పరిధిలోని కలివేముల గ్రామానికి చెందిన రైతు బక్కి శ్రీనివాస్ (35) మంగళవారం రాత్రి వరికోత యంత్రం ద్వారా తన పొలంలో పనులు చేపట్టారు. ఈ క్రమంలో యంత్రానికి వదులుగా ఉన్న విద్యుత్ తీగలు తగులుతుండగా వాటిని కర్ర సాయంతో తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు శ్రీనివాస్‌కు విద్యుత్‌షాక్ తగిలింది. దీంతో తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఆశ చూపి.. ఎర వేసి

సైబర్ మోసాలకు పాల్పడుతున్న నేరగాళ్లు



సిద్దిపేటకమాన్: సైబర్ నేరగాళ్లు రోజురోజుకు తీరుగా మోసాలకు పాల్పడుతూనే ఉన్నారు. కార్డులు అప్‌డేట్ చేసుకోవాలనో, రెట్టింపు లాభాలు వస్తాయనో, రకరకాలుగా ఆశచూపి ఎరవేస్తూనే ఉన్నారు.

బ్యాంకు అధికారులమని...

మీ క్రెడిట్ కార్డు వివరాలు చెప్పండి..బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామంటూ గుర్తు తెలియని వ్యక్తి బురిడీ కొట్టించిన ఘటన సిద్దిపేట పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. సిద్దిపేట పోలీస్‌కమిషనర్ ఎన్.శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేటకు చెందిన ఓ వ్యక్తికి ఎస్‌బీఐ బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని మీ క్రెడిట్ కార్డు గడువు ముగిసింది.. రెన్యూవల్ చేయడానికి వివరాలు తెలపాలని గుర్తు తెలియని వ్యక్తి మాటలు కలిపాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు తన క్రెడిట్ కార్డు వివరాలతో పాటు తన సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీ వివరాలు తెలపడంతో బాధితుడి ఖాతా నుంచి రూ.8,900 డెబిట్ అయినట్టు మెసెజ్ వచ్చింది. వెంటనే బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

రెట్టింపు లాభం పేరుతో మోసం

హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌కు ఇన్‌స్టాగామ్‌లో రూ.5వేలు పెట్టుబడిగా పెడితే రూ.30వేలు లాభం వస్తాయని మెసేజ్ వచ్చింది. అది నమ్మిన బాధితుడు అందులో ఉన్న ఫోన్‌నంబరుకు ఫోన్ పే ద్వారా రూ.5వేలు పంపించాడు. తర్వాత ఆ నంబరుకు ఫోన్ చేయగా సైబర్ నేరగాడు మరిన్ని డబ్బులు పంపాలని కోరాడు. దీంతో సైబర్ మోసం జరిగినట్టు గుర్తించిన బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నంబరుకు ఫోన్ చేయగా, పోలీసులు రూ.5వేలు ఫ్రీజ్ చేశారు.

పాన్‌కార్డు అప్‌డేట్ పేరుతో మోసం

కొముురవెల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒక వ్యక్తికి మీ పాన్ కార్డు అప్‌డేట్ చేసుకోవాలని, లేదంటే మీ బ్యాంకు ఖాతా బ్లాక్ అవుతుందని గుర్తు తెలియని వ్యక్తి మెసేజ్ పంపించాడు. అది నమ్మిన బాధితుడు తనకు వచ్చిన లింకును ఓపెన్ చేసి అందులో తన వివరాలు నమోదు చేసి, పాన్ కార్డు వివరాలు, తన సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీ వివరాలు చెప్పగా, బాధితుడి ఖాతా నుంచి రూ.92,220 డబ్బులు డెబిట్ అయినట్టు మెసేజ్ వచ్చింది. దీంతో సైబర్ మోసం జరిగినట్లు గుర్తించిన బాధితుడు వెంటనే జాతీయ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశాడు.

నిలిపి ఉంచిన లారీ చోరీ

నర్సాపూర్: పెట్రోలుబంకు వద్ద పార్కు చేసిన లారీని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. నర్సాపూర్-సంగారెడ్డి మార్గంలోని ఓ పెట్రోలు బంకువద్ద లారీని సోమవారం పార్కు చేశారు. అదే రోజు రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆ లారీని ఎత్తుకు పోయారు. లారీ యజమాని రమేశ్ మంగళవారం చుట్టు పక్కల గ్రామాలలో వెతికినా లారీ జాడ తెలియక పోవడంతో బుధవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు.

ఆటో కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి


ఐడీ కార్డులను అందజేస్తున్న యాదవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి

ములుగు(గజ్వేల్): ఆటో కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు పేర్కొన్నారు. ములుగు మండలం మామిడ్యాల ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఆటో డ్రైవర్లు ఏర్పాటు చేసుకున్న బీఆర్‌టీయూ ఆటో యూనియన్ కార్యాలయం వద్ద బుధవారం ముఖ్య అతిథులుగా హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో రంగాన్ని రక్షించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఎక్కడలేని విధంగా ఆటోకార్మికులకు రూ.5 లక్షల ప్రమాద బీమా, లైఫ్‌ట్యాక్స్ రద్దు లాంటి చర్యలు చేపట్టారన్నారు.

అనంతరం వారు ఆటో డ్రైవర్లకు ఐడీ కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వంటిమామిడి ఏఎంసీ ఛైర్మన్ జహంగీర్, పీఏసీఎస్ ఛైర్మన్ అంజిరెడ్డి, ఏఎంసీ వైస్ ఛైర్మన్ భూపాల్‌రెడ్డి, ఎంపీటీసీ లింగారెడ్డి, ఆటోయూనియన్ రాష్ట్ర నాయకులు మారయ్య, బాల్‌రాజ్‌యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు అర్జున్‌గౌడ్, అంజన్‌గౌడ్, బాపురెడ్డి, ఔలయ్య యాదవ్, కమ్మరి సత్తయ్య, బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో కమిషనర్ ఆకస్మిక తనిఖీలు


చెత్త సేకరణ వాహనాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సంపత్

సిద్దిపేటజోన్: మున్సిపల్ కమిషనర్ సంపత్ బుధవారం సిద్దిపేట పట్టణంలోని పలు వార్డుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 13, 39 వార్డుల్లో తిరిగి పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. మురికి కాలువల్లో మట్టి తీత పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఇంటింటి చెత్త సేకరణ ప్రక్రియ పరిశీలించారు. ఆయన వెంట కౌన్సిలర్లు విఠోభ, దీప్తి నాగరాజు, మున్సిపల్ అధికారులు సతీష్, అన్వేష్, మాధవి, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని రక్షించాలి


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని అనంతసాగర్‌లో ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. బుధవారం తహసీల్దార్‌కు శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నెంబర్ 37లో ఉన్న ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాచన్న, మాణయ్య, ఈశ్వరయ్య, బస్వరాజ్ పాల్గొన్నారు.

26,27 తేదీల్లో జెడ్పీ స్టాండింగ్ సమావేశాలు

సిద్దిపేటజోన్: సిద్దిపేట జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు ఈ నెల 26,27 తేదీల్లో నిర్వహిస్తామని జెడ్పీ సీఈఓ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 26న విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, 27న శిశు సంక్షేమ, సాంఘిక సంక్షేమ, ఆర్థిక, పనులు తదితర అంశాలపై సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అధ్యక్షతన జరుగుతాయన్నారు. కమిటీ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలన్నారు.

వ్యక్తికి జరిమానా

సిద్దిపేటజోన్: మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా చెట్టు నరికిన వ్యక్తికి అధికారులు జరిమానా విధించారు. సిద్దిపేటలోని 13 వార్డులో వేప చెట్టును నరికిన బలరాంకు రూ 3000 జరిమానా విధించారు. హరిత సిద్దిపేట లక్ష్యంగా సాగుతున్న పట్టణంలో చెట్టు నరికిన వారిపై చర్యలు తీసుకుంటామని హరితహారం అధికారి ఐల్లయ్య తెలిపారు.

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

చేర్యాల(సిద్దిపేట): వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో కర్రోల్ల స్వర్ణకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు భూపాల్, ప్రధాన కార్యదర్శి రంగారావు, జిల్లా అడిషనల్‌కార్యదర్శి ప్రభాకర్, దూల్మిట్ట మండల అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాల సాహిత్య సమ్మేళనంలో జిల్లా రచయితలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ సారస్వత పరిషత్ హైదరాబాద్ ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో నిర్వహించిన బాలసాహిత్య సమ్మేళనంలో సిద్దిపేట బాలసాహిత్య రచయితలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో బాలసాహిత్యంలో చేస్తున్న కృషిని వివరించారు. బాలసాహిత్య రచనలు బాలలకు చేరేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉండ్రాళ్ల రాజేశం, పెందోట వెంకటేశ్వర్లు, డాక్టర్ సుధకార్, యాడవరం చంద్రకాంత్, ఉస్మాన్ పాల్గొన్నారు.

◆ **అడ్మిషన్లకు హెల్ప్‌లైన్ డెస్క్**

జహీరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ అడ్మిషన్లకు హెల్ప్‌లైన్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ ఎండీ అస్లాం ఫారూఖీ తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి గాను మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను ఉపయోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు.

బైక్‌పై నుంచి పడి యువకుడు మృతి

కొండాపూర్(సంగారెడ్డి): బైక్‌పై నుంచి పడి యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ వెంకటేశం కథనం ప్రకారం..మండలపరిధిలోని మారేపల్లి గ్రామానికి చెందిన నడూళ్ల వెంకటేశం శుభకార్యం నిమిత్తం తన బంధువుల గ్రామమైన సంగారెడ్డి మండలం ఉత్తెరపల్లికి వెళ్లాడు. శుభకార్యం అనంతరం మంగళవారం తన స్వగ్రామానికి వస్తున్న క్రమంలో మారేపల్లి శివారులో బైక్‌పై నుంచి కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, మార్గమధ్యలోనే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న ఇద్దరు..

ఆత్మహత్యకు యత్నించిన ఒకరు..గాయపడిన మరొకరు చికిత్స పొందుతూ మృతి చెందారు.


ఖలీల్ (ఫైల్)

జోగిపేట(అందోల్): చికిత్స పొందుతున్న ఓ యువకుడి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. జోగిపేట పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన ఖలీల్ ఈ నెల 14న తనపై కొందరు దాడి చేశారంటూ 100కు డయల్ చేశారు. దీంతో వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని చూడగా అక్కడ ఖలీల్ తప్ప ఇతరులెవరూ లేరు. పోలీసులు దాడి విషయంపై అక్కడున్న వారితో మాట్లాడుతుండగా, ఖలీల్ తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుని పోలీస్‌స్టేషన్‌లోకి పరుగు తీశాడు. అప్రమత్తమైన సీఐ నాగరాజు, ఎస్‌ఐ సామ్యానాయక్ బయటకు వచ్చి సిబ్బంది కలిసి మంటలను ఆర్పారు. అనంతరం జోగి పేట ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి...

కల్హేర్(నారాయణఖేడ్): తీవ్రంగా గాయపడిన ఎలక్ట్రీషియన్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సిర్గాపూర్ ఎస్‌ఐ నారాయణ తెలిపారు. సిర్గాపూర్ మండలం ఖాజాపూర్‌కు చెందిన ఆరె రాజు(30) ఈ నెల 21న అంతర్‌గాంలో ఎలక్ట్రీషియన్ పనులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో పోచాపూర్ చౌరస్తా వద్ద జాదవ్‌నాగేష్ పల్సర్ బైక్‌పై అతివేగంగా ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో రాజుకు తీవ్రగాయాలలయ్యాయి. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాజు బుధవారం మరణించాడు. మృతుడి తండ్రి విఠల్ ఫిర్యాదు కేసు నమోదు చేశారు.

బస్సు బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు


బస్సుకింద పడిన బైక్


గాయాలతో క్షతగాత్రులు

సిద్దిపేటరూరల్: ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఇర్కోడు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మిరుదొడ్డికి చెందిన చెన్నయా బాలమల్లు పనిమిత్తం ఓ మహిళను బైక్‌పై ఎక్కించుకొని మిరుదొడ్డి నుంచి సిద్దిపేటకు వస్తున్నాడు. ఈ క్రమంలో ఇర్కోడ్ వద్దకు రాగానే అతివేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న బాలమల్లు మహిళతో సహా రోడ్డుపై పడిపోయారు. బాలమల్లుకు తలకు, ఎడమ చేతికి, కాలుకు గాయాలయ్యాయి. మహిళకు రెండు చేతులకు గాయాలయ్యాయి. దీంతో వారిని 108లో సిద్దిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బాలమల్లును సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పరధిలో వేర్వేరు చోట్ల ఇద్దరు మహిళలు అదృశ్యమయ్యారు. సంగారెడ్డి జిల్లాలో భార్యతో గొడవ భర్త ఇంటి నుంచి వెళ్లిపోయాడు.

ఎవరికీ చెప్పకుండా...

అమీన్‌పూర్ ఎస్‌ఐ కిష్టారెడ్డి కథనం ప్రకారం... రాఘవేంద్ర కాలనీకి చెందిన లక్ష్మి కూతురు భవాని(19) రెండు నెలల క్రితం చేవెళ్లకు చెందిన ఈశ్వర్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఈ నెల 17వ తేదీన భవానికి జ్వరం రావడంతో అల్లుడు అత్తకు ఫోన్ చేసి విషయం చెప్పగా, కుటుంబ సభ్యులు చేవెళ్ల వెళ్లి భవాని తీసుకొచ్చి ఆస్పత్రిలో చూపించారు. అప్పటి నుంచి పుట్టింటిలోనే ఉంటుండగా, ఈ నెల 22 వ తేదీన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా భవాని వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కూతురు అదృశ్యంపై తల్లి లక్ష్మి ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్యూటీకి వెళ్లిన మహిళ

అమీన్‌పూర్ ఎస్‌ఐ సుభాష్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని గండిగూడేనికి చెందిన నాగ సబిత(34) ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తోంది. పదేళ్ల కిత్రం భర్త వదిలివెళ్లిపోయాడు. ఈ నెల 22వ తేదీన డ్యూటీకి వెళ్లిన సబిత తిరిగి రాలేదు. తన సోదరి అదృశ్యమైందని మహేష్‌కుమార్ ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యతో గొడవపడి..

సంగారెడ్డి టౌన్: రూరల్ ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం..నారాయణఖేడ్ మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన కృష్ణ (32) పదేళ్ల క్రితం సంగారెడ్డి మండలం కులబ్‌గూర్‌కు ఇల్లరికం వచ్చాడు. కృష్ణ మద్యానికి బానిసై భార్య సంగీతతో తరచు గొడవపడేవాడు. ఈ నెల19న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతడి కోసం వెతుకుతుండగా 22న సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద కనిపించడంతో కుటుంబసభ్యులు ఇంటికి తీసుకెళ్లగా మళ్లీ భార్యతో గొడవపడి అదే రోజు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. భార్య సంగీత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో తొమ్మిది మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోమ, మంగళవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పట్టుబడిన వాహనదారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా తొమ్మిది మందికి ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జడ్జి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

వేర్వేరు చోట్ల ఐదుగురి ఆత్మహత్య

తండ్రి తరచు మద్యం సేవించి తల్లితో గొడవ పడుతున్నాడంటూ ఓ కూతురు, భార్యతో గొడవ పడి భర్త, అప్పుల బాధ భరించలేక రైతు, మద్యానికి బానిసై ఒకరు ఇలా వేర్వేరు కారణాలతో ఉమ్మడి జిల్లాలో ఐదుగురు ఆత్మహత్య చేసుకున్నారు.

భార్యతో గొడవ పడి...


దుర్గయ్య(ఫైల్)

పాపన్నపేట(మెదక్): కుటుంబ కలహాలతో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ విజయకుమార్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని పొడిచన్ పల్లి గ్రామానికి చెందిన ఎరుకల దుర్గయ్య(60) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం రాత్రి సమయంలో ఇంట్లో భార్యభర్త మధ్య చిన్న గొడవ జరిగింది. దీంతో దుర్గయ్య అదే రోజు రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. బంధువుల వద్దకు వెళ్లడేమో అని కుటుంబీకులు వెతక లేదు. ఈ క్రమంలో బుధవారం పోడిచన్‌పల్లి తండా శివారులో ఓ గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకొని ఉన్నాడని, అటుగా వెళ్లిన స్థానికులు మృతుడిని దుర్గయ్యగా గుర్తించి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించి భార్య సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు..

మెదక్ రూరల్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హవేళిఘనాపూర్ మండలంలోని తొగిటలో గ్రామానికి చెందిన కుర్మ బీరయ్య(42) ఉన్న తనకున్న కొద్దిపాటి పొలంతో పాటు ఎనిమిది ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు ఏర్పడటంతో మనస్తాపానికి లోనయ్యాడు. ఈ క్రమంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ కోసం వెతికారు. గ్రామ శివారులోని చెట్టుకు ఉరివేసుకొని బీరయ్య మృతి చెందినట్లు గమనించిన స్థానికులు కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం కోసం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు భార్యలు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మనస్తాపంతో యువతి...


సంధ్యారాణి (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): తండ్రి మద్యానికి బానిసై ఇంట్లో నిత్యం తల్లితో గొడవపడుతుండడంతో మనస్తాపం చెందిన యువతి హెయిర్ డై తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జీడిపల్లికి చెందిన నర్సుగారి సత్యనారాయణ, సుశీల రెండో కూతురు సంధ్యారాణి (18) ఓ పరిశ్రమలో పని చేస్తుంది. మంగళవారం రాత్రి తండ్రి మద్యం తాగి వచ్చి ఇంట్లో గొడవ పడ్డాడు. నిత్యం ఇలాగే జరుగుతుండడంతో మనస్తాపానికి గురైన సంధ్యారాణి బుధవారం ఉదయం ఇంట్లో హెయిర్ డై తాగి కింద పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు కొంపల్లిలోని ఓ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి...


బొందయ్య (ఫైల్)

నంగునూరు(సిద్దిపేట): మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రాజగోపాల్‌పేట ఎస్‌ఐ రాజుగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..పాలమాకులగ్రామానికి చెందిన దండబోయిన బొందయ్య(62) నాలుగు సంవత్సరాల క్రితం భార్య మరణించడంతో తాగుడుకు బానిసగా మారాడు. మద్యం మత్తులో బొందయ్య మంగళవారం తన పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని కుమారుడు నర్సింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నిర్మాణరంగ కార్మికుడు

నర్సాపూర్: కర్నూలుకు చెందిన రమేష్(40 కొంత కాలంగా నర్సాపూర్‌లో ఉంటూ నిర్మాణ రంగంలో కార్మికునిగా పని చేస్తున్నాడు. బుధవారం సాయంత్రం అతను నివాసముంటున్న ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు ఇంటి యజమాని, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెళ్లి చూసే సరికి ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని రమేష్ ఆత్మహత్య చేసుకొని ఉన్నాడు. కాగా అతని శవం ఉబ్బి ఉంది. మూడు రోజుల క్రితం ఉరి వేసుకుని ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, రమేష్ ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు.

గన్నీ సంచులు ఇవ్వాలని రైతుల ఆందోళన


రోడ్డుపై బారులు తీరిన రైతులు

పోలీసుల జోక్యంతో పంపిణీ


పోలీసుల సమక్షంలో గన్నీ సంచుల పంపిణీ

సిద్దిపేటజోన్: గన్నీ సంచులు ఇవ్వాలని రైతులు ఆందోళన చేసిన సంఘటన బుధవారం పత్తి మార్కెట్ యార్డులో చోటుచేసుకుంది. రైతుల కథనం ప్రకారం..కొన్ని రోజులుగా సిద్దిపేట యార్డుకు పెద్ద ఎత్తున ధాన్యం వస్తోంది. వాటికి మద్దతు ధర అందించే క్రమంలో తేమ శాతం తగ్గించేందుకు అధికారుల సలహా మేరకు యార్డులో ఆరబెట్టారు. వారం రోజులపాటు ధాన్యం యార్డులో ఉందని, గన్నీ సంచులు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు యార్డు ముందు రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వారికి బీజేపీ నాయకులు వేణుగోపాల్ మద్దతు పలికారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని రైతులకు నచ్చజెప్పి మార్కెట్ యార్డు అధికారులతో మాట్లాడారు. దగ్గరుండి గన్నీ సంచులు పంపిణీ చేయించారు. దీంతో అక్కడ గొడవ సద్దుమణిగింది. ఈ విషయంలో మార్కెట్ అధికారులు స్పందిస్తూ రెండు రోజుల క్రితం 15వేల గన్నీ సంచులు పంపిణీ చేసినట్టు చెప్పారు. లారీల ఎగుమతి సమస్య వల్ల మరోసారి గన్నీ సంచులు రైతులకు ఇవ్వలేదన్నారు.